పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మెడికల్ కళాశాలలో నూతనంగా ప్రారంభమైన పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20 వరకు దరఖాస్తుకు గడువు ఉందని ఇంటర్ పూర్తయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. డీఎంఎల్టీలో 30 సీట్లకు గాను 10 సీట్లు, డీఈసీజీలో 30 సీట్లకు గాను 17 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కామారెడ్డి జిల్లావాసులు మాత్రమే అర్హులని తెలిపారు.

నింబాచల లక్ష్మీనర్సింహునికి ఉయ్యాల సేవ

- సీతానగరిపై డోలా సేవ, పరవశించిన భక్త జనం
- నేడు లింబాద్రిగుట్ట జాతర



7

యునాని ఆసుపత్రి తెరుచుకునేనా?

- రోగులకు అందని యునాని వైద్యసేవలు
- కనిపించని వైద్యాధికారులు
- సరఫరా అయ్యే మందులూ మాయమవుతున్న వైనం



7

బడా భీమ్‌గల్‌లో ఇసుక డంపులు

- వే బిల్లుల ముసుగులో ఇసుక అక్రమ రవాణా
- దర్జాగా సాగుతున్న దందా
- అక్రమ వ్యాపారానికి ఓ ప్రజాప్రతినిధి అండదండలు
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, పోలీసు అధికారులు



7

తరుగు దోపిడీ



కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలు

- తరుగు ఇస్తేనే అన్‌లోడ్ చేస్తామంటున్న మిల్లర్లు
- క్వింటాల్‌కు 5 కిలోల వరకు తరుగు తీస్తున్న వైనం
- కేంద్రాల్లో నిబంధనలకు లోబడే కాంటా
- మిల్లుల వద్దకు వెళ్లే సరికి తాళ్లపేరుతో తరుగు తీస్తున్నారంటున్న రైతులు
- ఒక్కో ధాన్యం లోడ్‌లో 7 నుంచి 10 బస్తాల వరకు కోత
- మిల్లర్లతో క్షేత్రస్థాయి అధికారుల ములాఖత్
- విచ్చలవిడిగా తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారంటూ ఆరోపణలు
- జిల్లాలో 118 మిల్లులకు ధాన్యం కేటాయింపులు

కామారెడ్డి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని షెట్పల్లి సంగారెడ్డి కొనుగోలు కేంద్రంలో వారం రోజుల కింద 702 ధాన్యం బస్తాల లోడ్‌తో లారీ మాచారెడ్డి మండలంలోని భవానిపేటలో గల ఓ రైస్‌మిల్లుకు వెళ్లింది. అక్కడ సదరు రైస్‌మిల్లరు తాళ్లు ఉన్నాయంటూ తరుగు ఇవ్వాల్సిందేనని 696 బస్తాలకు ట్రక్‌షీట్ రాసిచ్చారు. అదేవిధంగా లక్ష్మంపల్లి కొనుగోలు కేంద్రం నుంచి వారం రోజుల కిందట 720 ధాన్యం బస్తాల లోడ్ మాచారెడ్డి మండలంలోని భవానిపేటలోని ఓ మిల్లుకు తరలించగా 713 బస్తాలకు ట్రక్‌షీట్ రాసిచ్చాడు. అంటే ఒక్కో ధాన్యం లోడ్ నుంచి సుమారు 7 నుంచి 10 బస్తాల వరకు తరుగు పేరిట మిల్లర్లు కట్ చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. నాణ్యమైన ధాన్యం ఉన్నా మిల్లర్లు కొర్రీలు పెడుతూ కోత విధిస్తున్నారని క్షేత్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాల్‌కు సుమారు 4నుంచి 5 కిలోల ధాన్యాన్ని అదనంగా మిల్లర్లు దోచుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పై స్థాయి అధికారులు మిల్లర్లు తరుగు పేరిట దోచుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అవేమి అమలు కావడం లేదు.

లోడ్‌కు 7 సంచులు కట్ చేస్తున్నారు

● ఆకుల బాలరాజ్, షెట్పల్లి సంగారెడ్డి, లింగంపేట



వారం రోజుల కిందట షెట్పల్లి సంగారెడ్డి కొనుగోలు కేంద్రం నుంచి 720 బస్తాల లోడ్‌తో 5 గురు రైతులకు సంబంధించిన ధాన్యం మాచారెడ్డి మండలం భవానిపేట ఓ రైస్‌మిల్లుకు కేంద్రం నిర్వాహకులు తరలించారు. కేంద్రంలోనే తాళ్లు, తేమ పేరుతో కిలోన్నర అదనంగా ధాన్యం కాంటా వేసి రికార్డు చేశారు. ఇదే లోడ్ మిల్లుకు వెళ్లే సరికి ఆయా మిల్లర్లు అవుట్ టర్న్ రావడం లేదని 7 బస్తాల ధాన్యం కోత విధిస్తూ 713కు ట్రక్‌షీట్ బిల్లు రాసిచ్చారు. ఇదేంటని మిల్లర్‌ను ప్రశ్నిస్తే ధాన్యం బరువు రావడం లేదని తాళ్లు ఉన్నాయని చెబుతున్నారు. 7 బస్తాల డబ్బులు కట్టిస్తే కేంద్రం నిర్వాహకులు ఇచ్చిన విధంగానే 720 బస్తాలు రాస్తామని మిల్లర్లు చెబుతున్నారన్నారు. ఇదేక్కడి దోపిడి అని అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదు.

118 మిల్లులకు ధాన్యం కేటాయింపు

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ సీజన్‌లో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 5.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు పౌర సరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 423 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మా దృష్టికి రాలేదు

● నర్సింహారావు, డీఎస్‌వో, కామారెడ్డి


షెట్పల్లి సంగారెడ్డి, లక్ష్మంపల్లి కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యాన్ని లోడ్ చేసి మిల్లులకు తరలిస్తే అక్కడ ధాన్యం సంచులు కోత విధిస్తున్నారని సమాచారం మా దృష్టికి రాలేదు. స్థానిక డీటీల ద్వారా సమాచారం తెలుసుకుని సంబంధిత మిల్లులపై చర్యలు తీసుకుంటాం. నాణ్యమైన ధాన్యం ఉంటే తరుగు ఇవ్వాల్సిన అవసరం లేదు. అలాంటి మిల్లులపై కఠిన చర్యలు ఉంటాయి. రైతులు తాళ్లు లేకుండా తేమ శాతం ఉండేలా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 118 మిల్లులకు ధాన్యం కేటాయించాం.

గత 20 రోజుల కిందట ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లో ప్రభుత్వం ఈ సారి కఠినంగా వ్యవహరిస్తోంది. బ్యాంక్ షూరిటీ ఇచ్చిన మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యం నిల్వలను బట్టి 10 శాతం గ్యారెంటీ ఇచ్చిన మిల్లులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బాయిల్డ్ రైస్‌మిల్లుల్లో 32 టన్నుల సామర్థ్యానికి 40 వేల క్వింటాళ్ల ధాన్యం, 40 టన్నుల సామర్థ్యానికి 50 వేల క్వింటాళ్లు, 50 టన్నుల సామర్థ్యానికి 60 వేల క్వింటాళ్లు, 60 టన్నుల సామర్థ్యానికి 70వేల క్వింటాళ్లు కేటాయించేలా ఏర్పాట్లు చేశారు. రైస్‌మిల్లులకు ఇదే ప్రాతిపాదికన జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 118 రైస్‌మిల్లర్లు షూరిటీలు ఇచ్చారని వారికి మాత్రమే కేటాయింపులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

అవుట్ టర్న్ పేరుతో అదనంగా ధాన్యం ఇవ్వాల్సిందే..

లింగంపేట మండలంలోని షెట్పల్లి సంగారెడ్డి, లంకంపల్లి కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం లారీలను నిర్వాహకులు మాచారెడ్డి మండలంలోని భవానిపేటలో ఓ రైస్‌మిల్లుకు తరలించారు. అయితే బరువు రావడం లేదని తరుగు కింద అదనంగా ధాన్యం ఇవ్వాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. పలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యతగా లేదనే సాకుతో 40 కిలోల సంచికి 2కిలోల 300 గ్రాముల వరకు అదనంగా తూకం వేస్తున్నారు. ధాన్యం తూకం వేసిన తర్వాత మళ్లీ మిల్లుల్లో తరుగు పేరిట కోత వేధించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాలి. వానాకాలంలో దొడ్డు రకం ధాన్యానికి కిలో నుంచి కిలోన్నర మేర అదనంగా బియ్యం వచ్చే అవకాశం ఉంది. అయినా మిల్లర్లు పలు కారణాలు చూపుతూ తరుగు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

(మిగతా 8వ పేజీలో)



కేంద్రం వద్ద నిర్వాహకులు 702 బస్తాలు రికార్డులో నమోదు చేయగా మిల్లు వద్ద 6 బస్తాలు కోత విధించింది ట్రక్‌షీట్‌లో 696 బస్తాలుగా నమోదు చేసిన దృశ్యం



కేంద్రం వద్ద నిర్వాహకులు 720 బస్తాలు రికార్డులో నమోదు చేయగా మిల్లు వద్ద 7 బస్తాలు కోత విధించింది ట్రక్‌షీట్‌లో 713 బస్తాలుగా నమోదు చేసిన దృశ్యం

ఉన్నత లక్ష్యాలకు ప్రణాళికలు ఏర్పరచుకోవాలి

బీర్కూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలకు ప్రణాళికలు ఏర్పరచుకోవాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ జి.రమణ విద్యార్థులకు సూచించారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా సైకియాట్రిస్ట్ డాక్టర్ రమణ, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సలాం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రధానంగా మానసి క సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని అధిగమించడానికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ దశలో విద్యార్థులు ప్రేమ సంబంధిత ఆకర్షణలకు లోనవుతారని అది కేవలం వయసు రీత్యా వచ్చే ఆలోచనలేనని వాటి పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే మత్తు పదార్థాల జోలికి అస్సలు వెళ్లకూడదన్నారు. అంతేకాకుండా మొబైల్ వినియోగాన్ని కేవలం సమాచార సేకరణకు మాత్రమే వినియోగించాలని, వినోదం కోసం వినియోగిస్తే మొబైల్ ఫోన్‌లకు బానిసలు అవుతున్నారని, చదువుపై శ్రద్ధ తగ్గుతుందని తెలిపారు. పరీక్ష కాలంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దన్నారు. మొదటి నుంచే ప్రణాళిక ప్రకారంగా చదువుకోవాలని అందుకు తగ్గ వాతావరణాన్ని సృష్టించుకోవాలన్నారు. మానసికంగా ఎటువంటి సమస్యలు వచ్చినా దగ్గరలోని మెడికల్ ఆఫీసర్‌ని లేదా సైకియాట్రిస్ట్‌ని సంప్రదించాలని సూచించారు. ఉచిత టోల్‌ఫ్రీ నెంబర్ 14416ని సైతం వినియోగించుకుని కౌన్సెలింగ్ పొందవచ్చునని సూచించారు. పరీక్షా కాలంలో విద్యార్థులు అనుసరించాల్సిన వ్యూహాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, అధ్యాప కులు చంద్రశేఖర్, శ్యామ్, దేవిసింగ్, సతీష్, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొ న్నారు.



బీర్కూర్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సైకియాట్రిస్ట్ డాక్టర్ రమణ

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్

కామారెడ్డి టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలే ఆధునిక దేవాలయాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. సరస్వతీ దేవికి పూజ నిర్వహించడంతో పాటు గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడైన సరే జ్ఞానమే అధికారమని అది గ్రంథాలయాలతోనే సాధ్యమని, గ్రంథాలయాలను ఉపయోగించుకుని పోటీ పరీక్షలు అనే మెట్లను ఎక్కి విజయ తీరాలను చేరుకోవాలని పాఠకులకు, విద్యార్థిని, విద్యార్థులకు తెలిపారు. గ్రంథాలయంలో పాఠకులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పుస్తకాల కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదిస్తే 48 గంటల్లో పుస్తకాలు అందుబాటులోకి తీసుకవచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయం శాంతి దేవాలయం అని గ్రంథాలయాల ద్వారానే నైతిక విలువలతో కూడిన బావి భారత పౌరులు తయారవుతారని తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, వైస్‌చైర్‌పర్సన్ ఉరుదొండ వనిత, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ, గ్రంథాలయ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడితో సర్వే

- సమయం తక్కువ.. ప్రశ్నలు ఎక్కువ!
- టార్గెట్ రీచ్ అవుతామా లేదా అనే ఆందోళనలో ఎన్యూమరేటర్లు
- గ్రామాల్లో అంతంత మాత్రంగానే ప్రజలు
- కొనుగోలు కేంద్రాల వద్ద ఉండడంతో ఇబ్బందులు
- పట్టుమని 10 ఇళ్లు చేసేలోపే చీకటిపడుతున్న వైనం
- సమయం పెంచాలంటున్న ఉద్యోగులు



సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

కామారెడ్డి టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల లెక్క తేల్చేందుకు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వేలో వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. నిర్ణీత సమయం లోపల ఎన్యూమరేటర్లు తమ టార్గెట్‌ను రీచ్ కావాలని అధికారులు ఆదేశిస్తుండడంతో టార్గెట్ రీచ్ అవుతామా లేదా అనే ఆందోళన చెందుతున్నారు. సమయం తక్కువగా ఉండగా సర్వేలో ఇచ్చిన ప్రశ్నలు ఎక్కువగా ఉన్నాయని వాపోతున్నారు. ఒక్కో ఇంట్లో కనీసం 45 నిమిషాల నుంచి గంటన్నర సమయం వెచ్చించాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ప్రజలు ప్రభుత్వం అందించిన షీట్లలో ఉన్న ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు మీనమేషాలు లెక్కిస్తుండడం, కొందరు అవన్నీ ఎందుకు అంటూ ఎదురు ప్రశ్నలు వేస్తుండడంతో వారికి సర్దిచెప్పి సర్వేను పూర్తిచేసే వరకు నానా కష్టాలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్యూమరేటర్ల ద్వారా సర్వే చేయించాల్సిన సూపర్‌వైజర్‌లు సైతం తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం చేపట్టే సర్వే టార్గెట్ వరకు చేరుకుంటామా లేదా అని మదనపడుతున్నామని పలువురు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్‌లు పేర్కొంటుండడం గమనార్హం.

గ్రామాల్లో అంతంత మాత్రంగానే ఉంటున్న ప్రజలు

ప్రస్తుతం వరి కోతలు మొదలుకావడంతో పంట పొలాలతో పాటు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గ్రామీణ ప్రజలు అక్కడే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. దీంతో సర్వే కోసం వెళ్తున్న ఎన్యూమరేటర్లకు ప్రజలు అందుబాటులో లేకపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఇంటి వద్ద వృద్ధులు ఉండడం, భార్య, భర్తలు ఇద్దరు వరి తేమ శాతం వచ్చేందుకు కల్లాల వద్ద వరి ధాన్యం ఆరాబోస్తు అక్కడే ఉంటున్నారు. ఇంటికి వెళ్లిన ఎన్యూమరేటర్లు ఇంటి వద్ద ఉన్న వృద్ధుల ద్వారా కావాల్సిన విషయాలు రాబట్టలేకపోతున్నారు. ఒకవేళ ఇంటి వద్ద ఉంటున్న వారు సైతం వివరాలు వెల్లడించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఇక ఆరుగురు అంతకంటే ఎక్కువగా ఉన్న కుటుంబ వివరాలు నమోదు చేసేందుకు గంటకు పైగా సమయం పడుతుందని వాపోతున్నారు. ఎన్యూమరేటర్లకే ప్రభుత్వం ద్వారా వారికి అందని సంక్షేమ పథకాలు ఎందుకు రావడం లేదని, తమకే ఎందుకు వాటిని రాకుండా చేస్తున్నారని, ఆస్తుల వివరాలు ఎందుకని, గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ ఎందుకు అమలు కావడం లేదో చెప్పాలని, రైతు రుణమాఫీ, రైతుభరోసా, పింఛన్‌లు ఎందుకు రావడం లేదని ఇలా అనేక ప్రశ్నలు వేస్తు ఎన్యూమరేటర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారని తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లోను ప్రజలు అందుబాటులో ఉంటున్నప్పటికీ వివరాలు వెల్లడించేందుకు వెనుకడుగు వేస్తున్నారని తెలుస్తోంది. ఉమ్మడి కుటుంబంగా ఒకే ఇంట్లో నివసిస్తున్న వివాహాలైన కుమారులను ప్రత్యేక కుటుంబాలుగా చూపిస్తున్నారు. ఇది కూడా సర్వే వివరాలు తీసుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని ఎన్యూమరేటర్లు పేర్కొంటున్నారు.

ఎన్యూమరేటర్ల సంఖ్యను పెంచాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు రోజుకు 20 వరకు ఇళ్లను సర్వే చేయాలని చెబుతే పట్టుమని 10 ఇళ్ల చేసేలోపే చీకటి పడుతుందని సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేలో ఒక్కో ఇంటికి కనీసం 45 నిమిషాల నుంచి గంటన్నర వరకు సమయం పడుతుంది. ముఖ్యంగా ఉపాధ్యాయులు అటు పాఠశాలకు వెళ్తు ఇటు సర్వేకు రావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి గోసను ఉపాధ్యాయ సంఘాల నాయకులతో వెల్లబోసుకుంటుండడంతో వారు సైతం అధికారులకు వినతి పత్రాలు అందిస్తూ సమయమైన లేదంటే ఎన్యూమరేటర్లనైన పెంచాలని కోరుతున్నారు. ప్రజలు వివరాలు వెల్లడించడంలో మీనమేషాలు లెక్కిస్తూ అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారని దీంతో వారికి సమయం కేటాయించి వివరించే లోపు చీకటి పడుతుందని తీరా సాయంత్రం ఉన్నతాధికారులు తీసుకుంటున్న వివరాల్లో టార్గెట్ చేరకపోవడంతో ఎలాంటి మాటలు పడాల్సి వస్తుందోనని ఆవేదన చెందుతున్నారని ఉపాధ్యాయ సంఘ నాయకులు పేర్కొంటున్నారు.



నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు



ఏర్గట్లలో బాలల దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉమ్మడి జిల్లా అంతటా బాలల దినోత్సవ వేడుకలు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే లు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి నెహ్రూ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు తాహెర్‌బిన్ హుందాన్, మానాల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: దేశ భవిష్యత్తు పాఠశాలల్లోనే ఇమిడి ఉంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు కమల, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాయకులు నాగి రెడ్డి,మల్లప్పపటేల్, మొగులాగౌడ్, షైమద్, పండరి, శ్యామప్ప, చిప్ప మోహన్, ఇస్మాయిల్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనీరుద్దీన్ ప్రసాద్, రాజశేఖర్, శ్రీనివాస్, విజయ్, ట్వింకిల్, నరేష్, గంగమోహన్, కోమలి పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని జడ్పీహెచ్ఎస్ బినోల పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

డొంకేశ్వర్: మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

మోపాల్:నిజామాబాద్ రూరల్ పరిధిలోని సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెడ్‌మాస్టర్ రామకృష్ణ, బాబురావు, ఉపాధ్యాయులు గోపాల్, జావిద్, విద్యాసాగర్, గంగాధర్, ఘనపురం దేవేందర్, లలిత, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్:బాలల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు పండ్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్ర మానికి సహకరించిన కరిపె రవీందర్, తోటరాజ శేఖర్‌లను ఎస్‌ఈ అభినందించారు. ఈ

నిజామాబాద్ అర్బన్:చిల్డ్రన్స్ డే సందర్భంగా నగరంలోని న్యాల్‌కల్ రోడ్ లోగల నలంద హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహారం యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల అధ్యక్షుడు అట్లూరి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ఆహార పదార్థాలు ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో నంగునూరు ప్రకాశం, ఇంగు శ్రీనివాస్, ఇంగు నేహా, తది తరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రామారెడ్డి మండల కేంద్రంలో నెహ్రూ దినోత్సవం, బాలల దినోత్సవం వేడుకలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆనంద్‌రావు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను బోధన్ పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, మీర్ నజీర్ అలీ, శ్రీకాంత్ గౌడ్, అబ్దుల్లా, జావీద్, మారుతీ మందిరం చైర్మన్ గుండెటి శంకర్, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, దాము, బొగ్గుల ప్రభాకర్, తలారి నవీన్, బ్యాటరీ బాబా, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: బాలల దినోత్సవం సందర్భంగా ఆర్మూర్ పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు జవహరాల్‌లాల్ నెహ్రూ, ఫ్యాన్సీ డ్రెస్‌లలో వచ్చి అలరించారు. అదే విధంగా పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి వివిధ రకాల వంటలు, తినుబండరాలను ప్రదర్శించారు.

మాక్లూర్: మండలంలోని మానిక్‌బండార్ శివారులో గల ఓస్కూల్‌లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మం లో పాఠశాల చైర్మన్,వైస్‌చైర్మన్,డైరెక్టర్‌లుఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్మైల్‌ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ షబాన గోహెర్, డైరెక్టర్ రఫీగోహెర్, ఉపాధ్యాయులు సవిత, సిందుర, సింధుజ, స్వప్న, ప్రసన్న, శ్రావణి, రోజా, సరిత, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ లీగల్:విద్యార్థులు విద్యను అభ్యసించాలని, విద్య వికాసానికి తోడ్పడుతుందని బాలల న్యాయమండలి చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కుష్బు ఉపాధ్యాయ్ అన్నారు.

భీమ్‌గల్: భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి కుంట రమేష్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అనంత్‌రావు, యువజన జిల్లా ఉపాధ్యక్షుడు వాక మహేష్, యువజన మండల అధ్యక్షుడు అవినాష్, మహిళ అధ్యక్షురాలు కల్పన, సీనియర్ నాయకులు విక్రం, మాలవత్ రాములు, శివ, క్రాంతి, సునీల్, మనోజ్, అజాద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

రెంజల్: మండలంలోని పలు పాఠశాలలో గురువారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని, భారత రత్న చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నవీపేట: మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో గురువారం స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్:దేశ తొలిప్రధాని స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతిని గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, గ్రంథా లయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి తదితరులు కాంగ్రెస్ భవన్‌లో నెహ్రూ చిత్రపటానికి అనంతరం నెహ్రూపార్క్‌లోని నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంభూపాల్, సంతోష్, రేవతి, సుభాష్ జాదవ్, ప్రమోద్, చంద్రకళ, ఉషా, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

భిక్కనూరు:మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో గురువారం దేశ తొలి ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని గ్రామపంచాయతీలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు.

తాడ్వాయి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠ శాలలో ఘనంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బాన్సువాడ టౌన్: బాన్సువాడ పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు , సిబ్బంది ఉన్నారు.

నాగిరెడ్డిపేట: మండల కేంద్రంలోని గోపాల్‌పేట మోడ ల్ స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా స్థానిక ఎస్సై మల్లారెడ్డి పాల్గొని పిల్లల భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: నసురుల్లాబాద్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నెహ్రూ జన్మదినం పురస్కరించుకుని బాలల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కాంచన, పుష్పలత, అనూష, స్వప్న, రూప, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని శ్రీ వాసవి స్కూల్‌లో బుధవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బొమ్మెర రవిందర్, రాంచంద్రం, నవిత, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న బాలికల వసతి గృహంలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యాబోధన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అదే విధంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో కూడా బాలల దినోత్సవ వేడుకలను చిన్నారులతో ఘనంగా నిర్వహించారు.

గాంధారి:మండల కేంద్రంలో గురువారం నెహ్రూ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తూర్పురాజులు, మాజీ సర్పంచ్ సంజీవ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ లక్ష్మన్, లైన్‌రమేష్,బాలయ్య,రవి,శంకర్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో నెహ్రూ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



పాఠశాలలో బాలల దినోత్సవ సంబరాలు జరుపుతున్న దృశ్యం



గోపాల్‌పేట మోడల్ స్కూల్‌లో..

ఎస్సారెస్పీలో నెహ్రూ, విద్యాసాగర్‌రావు జయంతి



నెహ్రూ, విద్యాసాగర్‌రావు చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఉద్యోగులు

మెండోర, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై పండిత్ జవహర్ లాల్‌నెహ్రూ, విద్యాసాగర్‌రావు జయంతి వేడుకలను ప్రాజెక్టు అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుపై నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇరిగేషన్ కార్యాలయం వద్ద నెహ్రూ, విద్యాసాగర్‌రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రాజెక్టు అధికారులు మాట్లాడుతూ నెహ్రూ 1963లో పోచంపాడ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన రోజు అభివర్ణించిన విధంగా నేడు ఎస్సారెస్పీ జలాశయం ఉత్తర తెలంగాణకు ఆధునిక దేవాలయంగా మారిందని కొనియాడారు. అలాగే విద్యాసాగర్‌రావు సాగునీటి రంగంలో చేసిన సేవలు గుర్తు చేశారు. వీరిద్దరికి శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ఉద్యోగులు జీవితాంతం రుణపడి ఉండాలి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు గణేష్, సుకుమార్, ఈఎస్ఈ లాల్‌సింగ్, ఏఈఈలు మాణిక్యం, పవన్, రాహుల్, కొండ వంశీ, శ్యాం, జునీద్, టీవో రాజారెడ్డి, పాల్గొన్నారు.

సొసైటీల్లో సహకార వారోత్సవాలు



ఏర్గట్లలో జెండాను ఆవిష్కరిస్తున్న చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య

ఏర్గట్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు తాళ్లరాంపూర్ సొసైటీల్లో సహకార వారోత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా సొసైటీల్లో జెండాను చైర్మన్‌లు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత్ భారత్ ధృక్పథాన్ని సహకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తూ 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏర్గట్ల, తాళ్లరాంపూర్ సొసైటీ డైరెక్టర్‌లు, కార్యదర్శులు గణేష్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ సొసైటీ, వేంపల్లి సొసైటీ, రెంజర్ల సొసైటీల లో గురువారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సొసైటీ చైర్మన్‌లు సహకార జెండాను ఆవిష్కరించి సహకార పాటను ఆలపించి ప్రతిజ్ఞ చేశారు. సహకార సంఘాలను పరస్పర సహకారంతో ప్రగతి సాధ్యమవుతుందని, సహకార స్ఫూర్తిని అందిపుచ్చుకుంటే అసాధ్యమనేది ఉండదని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సహకార సంఘాలకు శ్రీకారం చుట్టిందని, సంఘాల అభివృద్ధి ప్రభుత్వం సహకరిస్తుందని, సంఘాల రైతులలో సభ్యులుగా చేరాలని తమ సహకార సంఘాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ సొసైటీ చైర్మన్ నాగులపల్లి సూరజ్, రెంజర్ల సొసైటీచైర్మన్ కోమటిశెట్టి గంగాధర్, వేంపల్లి సొసైటీచైర్మన్ జక్క రాజేశ్వర్, ఆయా సొసైటీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేంపల్లి చైర్మన్ గడ్డం అశోక్‌రెడ్డి సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, సహకార సంఘ డైరెక్టర్‌లు మిపాల్‌రెడ్డి, ముత్యాల లక్ష్మణ్, సహకార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

డొంకేశ్వర్, నవంబర్14(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుల నుంచి జడ్పీటీసీ, చైర్మన్ వరకు అన్ని స్థానాలు కైవసం చేసుకునే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్ అన్నారు. గురువారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. త్వరలో జరగబోయే ఎన్నికల గురించి వివిధ అంశాలపై చర్చించారు. కార్యకర్తలు, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇస్తానన్న హామీలపై బీజేపీ కార్యకర్తలు పోరాటం చ ఏయాలని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, మాజీ ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, ప్రధానకార్యదర్శి మురళీ, కార్యవర్గ సభ్యులు సాగర్, మహేందర్‌గౌడ్, బాలన్న, నర్సయ్య, చంద్రాస్, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, భూమన్న, ముత్యం, తదితరులు ఉన్నారు.

ఆటో బోల్తా .. ఒకరి మృతి



మృతి చెందిన అలీ సాహెబ్

ఏర్గట్లనవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లరాంపూర్ ఒడ్డెర కాలనీ వద్ద ఆటో బోల్తాపడి ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరా ల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామా నికి చెందిన అలీ సాహెబ్ (60) ప్రస్తుతం నిజామాబాద్‌లో నివాస ముంటున్నారు. నిజామబాద్ నుంచి ఏర్గట్లకు కుటుంబ సభ్యులతో వచ్చి ఏర్గట్ల నుంచి తాళ్లరాంపూర్‌లో జరిగే ఓ వివాహానికి హాజరయ్యే క్రమం లో ఆటోలో వెళుతుండగా తాళ్లరాంపూర్ ఒడ్డెర కాలనీ వద్ద ఆటో డ్రై వర్ వేగంగా నడపటంతో అదుపు తప్పి ఆటో బోల్తా కొట్టడంతో పలు వురికి గాయాలు కాగా ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అందులో అలీ సాహెబ్ మృతి చెందినట్లు ఎఎస్సై లక్ష్మణ్ నాయక్ తెలి పారు. మృతుడి భార్య మొగుల బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కలిగోట్, తొర్లికొండ విద్యార్థుల ఎంపిక

జక్రాన్‌పల్లి నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల వాలీబాల్ పోటీలకు తొర్లికొండ, కలిగోట్ గ్రామాల జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయులు గంగామోహన్, యాదగిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలిగోట్ పాఠశాలలో చదువుకుంటున్న టి.రాము, ఎం.సాన్విక, తొర్లికొండ పాఠశాలలో చదువుకుంటున్న బి.రాజులు ఎంపికయ్యారన్నారు. మెదక్ జిల్లా చేగుంట ఆదర్శ పాఠశాలలో ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో తొర్లికొండ విద్యార్థి బి.రాజు, కలిగోట విద్యార్థి ఎం.సాన్విక, పి.రాము పాల్గొంటారని వ్యాయమ తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన సాన్విక, టి.రాము, బి.రాజును ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కలిగోట పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమచారి అభినందించారు.

ఘనంగా బీమన్నదేవుని ఉత్సవాలు

ఆర్మూర్‌రూరల్, నవంబర్14(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో గురువారం బీమన్నదేవుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బీమన్నదేవుని గదాలను(దేవుని ప్రతిమ)లను చేపూర్ నుంచి నాగాపూర్ శివారులోని గోదావరి శివారులోకి వెళ్ళి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవతమూర్తును గ్రామానికి తీసుకువచ్చి భీమన్న ఆలయంలో ఉంచారు. అంతకు ముందు ఆదివాసి నాయకపోడు సంఘ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలిరాగా మహిళల మంగళహారతులు, యువకులు బాణసంచకాలుస్తూ గ్రామంలో దేవతమూర్తులను ఊరేగించారు. శుక్రవారం దేవుని కళ్యాణం, సత్య నారాయణ వ్రతాలు, అనంతరం యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రంగు మారిన ధాన్యంపై రైతులు ఆందోళన చెందొద్దు

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



కోటగిరిలో రంగు మారిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కోటగిరి,నవంబరు14(ఆంధ్రజ్యోతి): రంగు మారిన ధాన్యంపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఉన్నతాధికారుల చర్చించి రైతులకు న్యాయం చేస్తామని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో హామీ ఇచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం రంగు మారిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. మార్కెట్ కమిటీ ఆవరణలో నిల్వ ఉంచిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ రంగు మారిన ధాన్యాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అకాల వర్షంతో ధాన్యం రంగు మారిందని రైతులు వివరించారు. తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను జిల్లా కలెక్టర్‌కు వివరిస్తానని సబ్ కలెక్టర్ రైతులకు తెలిపారు. అలాగే రైస్ మిల్లర్లకు సైతం ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ గంగాధర్, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మాజీ జడ్పీటీసీ శంకర్ ఉన్నారు.

గోసంగి కులస్తులకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి

బోధన్‌రూరల్,నవంబరు14(ఆంధ్రజ్యోతి): గోసంగి కులానికి సంబంధం లేని బెడ, బుడగ, జంగల కులాలకు చెందిన వారు గత 30ఏళ్ల నుంచి గోసంగి కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారని నిజమైన గోసింగిలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా న్యాయం చేయాలని గురువారం గోసంగి జిల్లా అధ్యక్షులు సుంకరిపల్లి సాయన్న ఆధ్వర్యంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 నుంచి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని, రెండు నెలల క్రితం జిల్లా కలెక్టర్ డీఎల్ ఎస్సీ కమిటీ ఏర్పాటు చేస్తూ అడిషనల్ కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రస్తుతం ఆర్డీవో, ఎమ్మార్వోల పరిశీలన జరుగుతున్నందున తొందరగా నివేదిక కలెక్టర్‌కు ఇవ్వాలని, జిల్లాలోని ఆర్డీవోలను కోరడం జరిగిందన్నారు. బోధన్ డివిజన్ పరిధిలోని నవీపేట్ మండలం హనుమాన్ ఫారంలోనే గోసంగి కులస్థులు ఉన్నారని వీరిని మాత్రమే కుల గణనలో గోసంగిలుగా రాయాలని ఇన్ని రోజులుగా గోసంగిలుగా చెలామణి అయిన రాకాసిపేట్ గోసం బస్తి, బోధన్ మండలం నాగన్‌పల్లి, బెల్లాల్, ఎడపల్లి, వర్ని మండలంలోని హుమ్నాపూర్, చందూర్ మండలంలోని చందూర్, గోవూర్, రెంజల్ మండలంలోని సాటాపూర్, నవీపేట మండలంలోని మోకన్‌పల్లి, జలాల్‌పూర్, రాంపూర్, లంగ్డాపూర్, అబ్బాపూర్ గ్రామాలలో ఉన్న వారు గోసంగి కులస్థులు కారని ఆరోపించారు. వీరు బెడ, బుడగ, జంగం కులస్థులు అని వీరిని కుల గణనలో బెడ, బుడగ, జంగం కులస్థులుగా రాయాలని అధికారులను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లెపూల సాయి చరణ్, ప్రధాన కార్యదర్శి మోహన్, కోశాధికారి ధర్మపురి, కార్యదర్శి వెంకటేష్, నర్సయ్య, మల్లేష్, శశి కుమార్ పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

బోధన్‌రూరల్,నవంబరు14(ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అమ్దాపూర్ వాసి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరుకుంది. బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట హరికృష్ణ(38)అనే వ్యక్తి దుబాయ్‌లో పని నిమిత్తం వెళ్లి వారం రోజుల లోపే అక్కడ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డ ఘటన విదితమే. గ్రామ పెద్దలు సిర్ప సుదర్శన్ దుబాయ్‌లోని కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి మృతదేహన్ని గురువారం అమ్దాపూర్ గ్రామానికి రప్పించారు. పరాయి దేశానికి పని కోసం వెళ్లిన భర్త ఇక్కడ నుండి వెళ్లిన వారం రోజుల లోపే మృతి చెందగా నేడు గ్రామానికి మృతదేహం రావడంతో మృతుడి భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు రోదనలు గ్రామస్థులందరిని కంటతడి పెట్టించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతి చెందిన కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామపెద్దలు, గ్రామస్థులు కోరుతున్నారు. గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ట్రాన్స్ ఫార్మర్ల కాయిల్స్ చోరీ

బోధన్‌రూరల్,నవంబరు14(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్, ఏరాజ్‌పల్లి గ్రామాలలోని పంట పొలాలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించడం జరిగిందని పంట పొలాల రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి అన్నారు. గ్రామంలోని సీసీ పుటేజ్ ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపి పట్టుకుంటామని హామీ ఇచ్చారు.

వే బిల్లులను పరిశీలించిన తహసీల్దార్

బోధన్‌రూరల్,నవంబరు14(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని సిద్దాపూర్, కల్దుర్కి, ఖండ్‌గావ్ మంజీర నుండి ఇసుకకు అనుమతులు ఇవ్వగా గురువారం బోధన్ మండల తహసీల్దార్ విఠల్, కల్దుర్కి గ్రామ శివారులో ఇసుక అక్రమ రవాణా జరగకుండా స్వయాన తానే ట్రాక్టర్లను ఆపి వే బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

కోటగిరి,నవంబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ వర్గీకరణ అమలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పోచీరాం, మారుతి, యాదవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు

డొంకేశ్వర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయిల్ పాం సాగు చేస్తున్న వివిధ గ్రామాకు చెందిన రైతులకు నూత్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫ్రీ యూనిక్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్‌పాం తోట సాగు చేస్తున్నప్పటి నుంచి 30వేల వరకు పూతను తొలగించాలని సూచించారు. ఆయిల్‌ఫాం మొక్కల చుట్టు కలుపు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఆయిల్‌పాం మార్కెట్‌లో ఒక టన్ను ధర రూ.19144ఉందని, 2022-23సంవత్సరంలో ఆయిల్ పాం సాగు చేసిన రైతులు 2025 సంవత్సరం నాటికి దిగుబడి వస్తుందని అన్నారు. డిసెంబరు నెలలో రైతులకు అందుబాటులో గెలల సేకరణ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ రోహిత్; హర్టికల్చర్ ఆఫీసర్ సంధ్యారాణి, క్లస్టర్ అధికారి నిఖిల్, రైతులు దేగాం గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

లింబాద్రిగుట్టపై వసతుల కల్పనలో విఫలం



భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామి

భీమ్‌గల్,, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీలింబాద్రి గుట్టపై వసతుల కల్పనలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విఫలమయ్యాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామి అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ పవిత్ర పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్టపై సౌకర్యాలు కల్పించలేక నామ మాత్రం రోడ్డు పోసి అభివృద్ధి చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

రుద్రూర్‌లో ఉపాధ్యాయుల నిరసన

కోటగిరి,నవంబరు14(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలంలోని అంబం మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం 1వ తేదిన తమ వేతనాలు చెల్లించాలంటూ నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదిన తమ వేతనాలను 010 అకౌంట్ ద్వారా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బీర్కూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరా పూర్ గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వీరాపూర్‌కు చెందిన 23ఏళ్ల యువకుడికి, మెండో రా మండలం దూద్గాన్‌కు చెందిన 14ఏళ్ల బాలికతో పెద్దలు వివాహం నిశ్చయించారు. గురువారం వీరాపూర్‌లో వివాహం జరుగుతుండగా కొందరు వ్యక్తులు 1098 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి బాల్య వివాహం గురించి సమాచారం అందించారు. దీంతో బాలల పరిరక్షణ అధికారులు, ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడికి చేరుకున్నారు. జరగబోతున్న పెళ్లిని నిలిపివేశారు. అనంతరం అధికారులు ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను కామారెడ్డి బాలల సంక్షేమ కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారులు స్రవంతి, మోహన్, సీడీపీవో సౌభాగ్య, సూపర్ వైజర్ సుమలత, ఆర్ఐ పూల్‌సింగ్ తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

రెంజల్,నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన హరితకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును గురువారం మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూపల్లి గ్రామానికి చంఎదిన హరిత అనారోగ్యానికి గురవ్వడంతో వైద్య ఖర్చుల నిమిత్తం 9వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించడం జరిగిందని, చెక్కు మంజూరు చేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిరెడ్డి, జావీదోద్దీన్, హాజీ ఖాన్, షబ్బీర్, సల్మాన్ తదితరులున్నారు.

రామాలయంలో కార్తీక దీపోత్సవం

నవీపేట,నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సీతారామాలయంలో గురువారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. మహిళలు ఒక్కొకరు 33దీపాల చొప్పున ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కప్పలవాగు నుంచి తరలించి నిల్వ చేసిన ఇసుక

ఫోకస్

బడా భీమ్‌గల్‌లో.. ఇసుక డంపులు!

- వే బిల్లుల ముసుగులో అక్రమ ఇసుక రవాణా
- దర్జాగా సాగుతున్న దందా
- అక్రమ వ్యాపారానికి ఓ ప్రజాప్రతినిధి అండదండలు
- మామూళ్ల మత్తులో రెవెన్యూ పోలీసు అధికారులు

భీమ్‌గల్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలోని కప్పలవాగు నుంచి విచ్చలవిడిగా అక్రమంగా ఇసుక రవాణా సాగుతోంది. రెవెన్యూ అధికారులు ప్రతీ బుధవారం, శుక్రవారం అక్కడ ఇసుక పాయింట్‌ను ఏర్పాటు ఇస్తారు. వే బిల్లులు 50 ఉంటే అక్కడ ఉన్న రెవెన్యూ అధికారిని మచ్చిక చేసుకొని 300 నుంచి 400 ట్రిప్పుల ఇసుకను అక్రమంగా డంప్ చేస్తారు. ఇసుక మాఫియా వేబిల్లుల ముసుగులో విచ్చలవిడిగా అక్రమంగా ఇసుకను తరలిస్తూ గ్రామ శివారులో ఇసుకను డంప్ చేసి అర్ధరాత్రి లారీల్లో టిప్పర్‌లలో ఇసుకను ఆర్మూర్, నిజామాబాద్‌కు తరలిస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. ఇదంత రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలియకుండానే జరుగుతుందా అని పలువురి గుసగుసలు విన్పిస్తున్నాయి. గురువారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో సుమారు అక్కడక్కడ సుమారు 200 ట్రిప్పుల ఇసుక డంప్‌లను గుర్తించారు. ఈ అక్రమ ఇసుక రవాణాకు బాల్కొండ నియోజకవర్గంలోని ఓ ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నాయని ఆయన అనుచరులే ఈ దందా నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వమే ఇసుకను అధికారికంగా గ్రామాల వారీగా వేలం వేసి సరఫరా చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడమే కాకుండా ప్రజలకు తక్కువ ధరకే ఇసుక లభించే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈవైపుగా ఆలోచనలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమ ఇసుక డంప్‌లను సీజ్ చేసి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు



• మహమ్మద్ షబ్బీర్, తహసీల్దార్

మండలంలో ఎక్కడైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బడాభీమ్‌గల్ గ్రామంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక మా దృష్టికి రాలేదు. కుటుంబ సర్వే కార్యక్రమంలో బీజీగా ఉన్నాను. రాత్రి పూట అక్రమ ఇసుక రవాణాపై దృష్టి పెట్టాలని భీమ్‌గల్ పోలీస్‌లకు సమాచారం ఇస్తాం. అక్రమ డంప్‌లను సీజ్ చేసి అవి ఎవరివో గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం.



భక్తి



డోల సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పండితులు

నింబాచల లక్ష్మీనర్సింహునికి ఉయ్యాల సేవ

• సీతానగరిపై డోలా సేవ, పరవశించిన భక్తజనం



లింబాచల లక్ష్మీనర్సింహ స్వామి ప్రతిమ



డోలసేవ కోసం ఏర్పాటు చేసిన సీతానగరిపై నాలుగు స్తంభాల రాతి మండపం

భీమ్‌గల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్టపై కొనసాగుతున్న లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు సీతానగరిపై ఆలయ పండితులు డోల సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మధుర ఘట్టాన్ని తిలకించిన భక్తులను ఆనంద పరవశంలో మునిగితేలారు. స్వామివారి ఆలయానికి పశ్చిమ వైపున ఉన్న జోడు లింగములకు వెళ్లేదారి ఉన్న సీతానగరిలో గల నాలుగు స్తంబాల రాతి మందిరంలో డోలా సేవా చేపట్టారు. శ్రీలక్ష్మీనర్సింహ ఉత్సవమూర్తులను పల్లకీలో వేద మంత్రోచ్ఛరణాల మధ్య బాజభజంత్రిలు, మేళ తాళాలతో సీతానగరిలోని మండపానికి తీసుకువచ్చి డోల సేవను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి పాటలు పాడుతూ పరవశంతో మునిగిపోయారు. తిరుగు ప్రయాణంలో జోడు లింగాలకు ఎదురుగా నిలిపి శ్రీ లక్ష్మీనర్సింహుని నుంచి జోడు లింగల దర్శనం చేసుకున్నారు.

నేడు లింబాద్రిగుట్ట జాతర

లింబాద్రిగుట్టపై కొనసాగుతున్న శ్రీనింబాచల నర్సింహుని బ్రహ్మోత్సవాలు కార్తిక పౌర్ణమి సందర్భంగా జాతర నిర్వహించనున్నట్టు ఆలయ దర్మకర్త నంబి వంశస్థులు తెలిపారు. మధ్యాహ్నం రతభ్రమణ కార్యక్రమం చేపడుతున్నట్టు వారు తెలిపారు. జాతర సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, 12మంది ఎస్సైలు, 300 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డుల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్టు భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఇందుకు గుట్టపై ఆరు అవుట్ పోస్టులు ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు.



డోల సేవను తిలకిస్తున్న భక్తులు

ఇందిరమ్మ ఇళ్లపై పేదల ఆశలు!



మద్నూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలో తమ సొంతింటి కల నెరవేరబోతుందంటూ వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సొంత స్థలం ఉండి ఇప్పటివరకు ఇల్లు నిర్మించుకోలేకపోయిన వారికి మొదటి విడతలో ఇందిరమ్మ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని మంత్రి ప్రకటించడంతో వారిలో ఆశలు చిగురించాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ పథకం కింద పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ఆ మేరకు దరఖాస్తులు కూడా స్వీకరించారు. అర్హులైన వారిని ఎంపిక చేసి ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. కాని తొమ్మిది నెలలుగా దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూశారు. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికి ఇందిరమ్మ ఇల్లు 400 చదరపు అడుగులలో ఇల్లు నిర్మించుకోవడానికి గ్రామ సభల ద్వారా ఎంపిక చేసి నాలుగు విడతల్లో ఐదు లక్షలు ఇస్తామని ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. పునాది నిర్మాణం పూర్తి కాగానే రూ. లక్ష, లెంటల్ లెవల్‌కు చేరగానే రూ. 1.25 లక్షలు, స్లాబ్ వేశాక రూ.1.75 లక్షలు, గృహ ప్రవేశం సమయంలో మిగిలిన లక్ష రూపాయలను ప్రభుత్వం అందిస్తుందని ప్రకటించారు. అదే విధంగా పేదల్లో బహు పేదలను లబ్ధిదారులుగా గ్రామ సభల ద్వారా ఎంపిక చేస్తామని, ఇంటిని ఇంటి యజమానురాలి పేరుని మంజూరు చేస్తామని స్పష్టంచేశారు. మంత్రి ప్రకటనతో గ్రామీణ ప్రాంతాలలో సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విన్నర్‌గా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న విద్యాధికారులు

వేల్పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని ఓడిన వారు గెలుపు కోసం ప్రయత్నించాలని మండల విద్యాధికారిణి రేణుక అన్నారు. మండలంలోని మోతె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహించిన మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవానికి రేణుక మండల విద్యాధికారిణి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్య రంగంలో బాగా చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కల్పిస్తాయన్నారు. క్రీడలతో అన్నివిధాలా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో విజేతలు

వాలీబాల్ సబ్‌జునియర్ అండర్ -14 బాలుర విభాగంలో జడ్పీహెచ్ఎస్ పడిగల్ విన్నర్, అంక్సాపూర్ రన్నర్‌గా, పచ్చలనడ్కుడ ద్వితీయ, సబ్‌జూనియర్ బాలికల విభాగంలో జడ్పీహెచ్ఎస్ రామన్నపేట్ విన్నర్‌గా, మోతె రన్నర్‌గా, కుకునూర్ తృతీయస్థానంలో నిలిచాయి. వాలీబాల్ జూనియర్ బాలుర విభాగంలో వేల్పూర్ విన్నర్, పడిగెల రన్నర్, మోతె తృతీయ, జూనియర్ బాలికల విభాగంలో కుకునూర్ విన్నర్, లక్కోర రన్నర్‌గా, పచ్చలనడ్కుడ తృతీయ స్థానంలో నిలిచాయి. ఖోఖో సబ్‌జూనియర్ బాలుర విభాగంలో వేల్పూర్ విన్నర్, పచ్చలనడ్కుడ రన్నర్‌గా, అంక్సాపూర్ తృతీయస్థానంలో నిలువగా, సబ్‌జూనియర్‌బ బాలికల విభాగంలో పచ్చలనడ్కుడ విన్నర్‌గా, అంక్సాపూర్ రన్నర్‌గా, వేల్పూర్ తృతీయ స్థానంలో నిలిచాయి. ఖోఖో జూనియర్ బాలుర విభాగంలో పచ్చలనడ్కుడ విన్నర్‌గా, వేల్పూర్ రన్నర్‌గా, అంక్సాపూర్ తృతీయ స్థానంలో నిలువగా, జూనియర్ ఖోఖో బాలికల విభాగంలో పచ్చలనడ్కుడ విన్నర్‌గా, అంక్సాపూర్ రన్నర్‌గా, వేల్పూర్ తృతీయస్థానంలో నిలిచాయి. ఖోఖో జూనియర్ బాలుర విభాగంలో పచ్చలనడ్కుడ విన్నర్, వేల్పూర్ రన్నర్‌గా, అంక్సాపూర్ తృతీయస్థానంలో నిలువగా, జూనియర్ బాలికల విభాగంలో పచ్చలనడ్కుడ విన్నర్, అంక్సాపూర్ రన్నర్‌గా, వే ల్పూర్ తృతీయస్థానంలో నిలిచాయి. కబడ్డీ సబ్‌జూనియర్ బాలుర విభాగంలో పడిగెల విన్నర్, మోతె రన్నర్‌గా, వేల్పూర్ తృతీయ స్థానంలో నిలువగా కబడ్డీ సబ్‌జూనియర్ బాలికల విభాగంలో వేల్పూర్ విన్నర్, పచ్చలనడ్కుడ రన్నర్‌గా, అంక్సాపూర్ తృతీయస్థానం, కబడ్డీ సబ్‌జూనియర్ బాలుర విభాగంలో పడిగెల విన్నర్‌గా, వేల్పూర్ రన్నర్‌గా, మోతె తృతీయస్థానంలో నిలిచాయి. కబడ్డీ జూనియర్ బాలికల విభాగంలో కుకునూర్ విన్నర్, రామన్నపేట్ రన్నర్‌గా, వేల్పూర్ తృతీయస్థానంలో నిలిచాయి.

యునాని ఆసుపత్రి

తెరుచుకునేనా?

» రోగులకు అందని యునాని వైద్యసేవలు » కనిపించని వైద్యాధికారులు » సరఫరా అయ్యే మందులూ మాయమవుతున్న వైనం

ఆంధ్రజ్యోతి పరిశీలన



మూతబడిన అచ్చంపేటలోని యునాని ఆసుపత్రి



మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన యునాని ఆసుపత్రి ఇదే..

నిజాంసాగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామంలో ఉన్న యునాని వైద్యశాల వైద్యసేవలు అందించేవారు లేక మూతబడింది. దీంతో యునాని వైద్యం కోసం వచ్చే రోగులు నిరాశకు గురవుతున్నారు. ఏళ్ళ కిందట ఏర్పాటు చేసిన యునాని వైద్యశాల రోగులకు సేవలు అందించకపోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అచ్చంపేట గ్రామంలో నీటి పారుదల శాఖ క్వార్టర్లలో అప్పటి ప్రభుత్వాలు, పాలకులు యునాని వైద్యశాలను ఏర్పాటు చేశారు. దాదాపు పాతికేళ్ల పాటు వైద్య సేవలు అందించిన యునాని వైద్యం ప్రస్తుతం వైద్యాన్ని అందించకలేకపోతున్నారు. ఇక్కడ పని చేసే వైద్యాధికారులు అడ్రస్ లేకుండా పోయారు. ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు, పాలకులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం 2014 నుంచి 2013 వరకు అధికారం చేపట్టింది. అప్పట్లో నియోజకవర్గ ఎమ్మెల్యే హనుమంత్ షిండే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులను మెరుగుపరిచి గ్రామాల ప్రజలకు యునాని వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా పలుమార్లు ఆసుపత్రులను సందర్శించిన యునాని వైద్యం చేసే అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియకపోవడం పట్ల ఉన్న యునాని ఆసుపత్రికి మండల కేంద్రానికి తరలించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు. మండల కేంద్రంలో యునాని వైద్యశాలను లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆ భవనం నిరుపయోగంగా ఉండటం విశేషం. ఈ ఆసుపత్రికి కేటాయించిన సిబ్బంది ఎక్కడ పని చేస్తున్నారు అనే విషయం ఎవరికి తెలియదు. ఆసుపత్రికి వచ్చే రోగులు నిరాశ పడుతూనే ఉన్నారు. వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులు వెనుదిరిగిపోతున్నారు. మండల కేంద్రంలో నిర్మాణం చేపట్టిన యునాని వైద్యశాల నిర్మాణం చేసి ప్రారంభ స్థలానికి ముస్తాబు చేసిన పాలకులు యునాని ఆసుపత్రికి ప్రారంభించలేకపోయారు. మండల కేంద్రంలో నిర్మాణం పూర్తి చేసుకున్న యునాని ఆసుపత్రి నిరుపయోగంగా దర్శనమిస్తుంది. అచ్చంపేటలో ఉన్న ఆసుపత్రి ఎన్నడూ కూడా తెర్చుకోలేకపోయింది. సిబ్బంది ఎక్కడ ఉంటారని తెలియటం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆసుపత్రిని మండల కేంద్రానికి తరలించి యునాని వైద్య సేవలు అందుబాటులో ఉండేటట్లు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భిక్కనూరులో ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

భిక్కనూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సినిమా టాకీసు చౌరస్తా వద్ద గురువారం ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతిచెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నీల ఇస్తారి(58) సైకిల్ పై చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం వైపు వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, కాలనీ వాసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను చితక బాదారు. వెంటనే పోలీసులు చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

ట్రాక్టర్ చెట్టుకు ఢీకొని డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

బీర్కూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చించొల్లికి చెందిన పురుషోత్తం గురువారం ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసుకుని నసురుల్లాబాద్‌కు వెళ్లాడు. ప్రభుత్వ పనులు జరిగే చోటు ఇసుకను అన్‌లోడ్ చేశాడు. అనంతరం తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో కిష్టాపూర్ వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో పురుషోత్తం కాలు విరగడంతో పాటు తలకు, చేతులకు గాయాలయ్యాయి. అతడిని నిజామాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు.

ఆయుధాలతో విద్యార్థిని బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు

ఎల్లారెడ్డి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆయుధాలతో విద్యార్థిని బెదిరించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రుద్రారం గ్రామానికి చెందిన గూడ అరవింద్ అనే వ్యక్తి బుధవారం ఉదయం ఎల్లారెడ్డి పట్టణ సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాల ఆవరణలో అనుమానస్పదంగా తిరుగుతుండగా ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మహేష్, కాచర్ల చరణ్, మేదరి చరణ్ అనే ముగ్గురు విద్యార్థులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని మందలించడంతో మనసులో పెట్టుకున్న గూడ అరవింద్ సాయంత్రం 4 గంటలకు విద్యార్థులు ఇంటికి వెళుతున్న సమయంలో మహేష్ అనే విద్యార్థిని అరవింద్ అనే వ్యక్తి ఆయన స్నేహితులు అయిన భాను ప్రసాద్, ఇర్ఫాన్, తాజుద్దీన్ నలుగురు కలిసి స్కూల్ పక్కన ఉన్న వెంచర్‌లోకి తీసుకెళ్లి బూతు మాటలతో తిడుతూ కొట్టి వారి వద్ద ఉన్న గొడ్డలి, సైకిల్ చైన్ రింగ్‌తో చేయబడిన ఆయుధాలను చూపించి మళ్లీ మా జోలికి వస్తే చంపేస్తామని బెదిరించినట్లు విద్యార్థి మహేష్ గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహేష్ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

బీర్కూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమను తమ తల్లిదండ్రుల నుంచి రక్షించాలని కోరుతూ ఒక ప్రేమ జంట గురువారం బీర్కూర్ పోలీసులను ఆశ్రయించింది. బీర్కూర్‌కు చెందిన కృష్ణ, గోపూర్‌కు చెందిన అఖిల్‌లు గత కొన్నాళ్ళుగా ప్రేమించు కుంటున్నారు. అయితే గురువారం బాన్సువాడలోని ఒక గుడిలో వివాహం చేసుకు న్నారు. అనంతరం తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ప్రేమ జంట బీ ర్కూర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు అఖిల్, కృష్ణల తల్లిదండ్రు లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

అల్ఫాజోలం పట్టివేత.. ఐదుగురిపై కేసు నమోదు



మాట్లాడుతున్న సీఐ సంపత్ కుమార్

దోమకొండ,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంచనూర్ గ్రామంలో ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఉన్న కల్లు కాంపౌండ్‌లో నిషేద ఉద్రేకమైన అల్ఫాజోలంను వాడి కల్తీకల్లు తయారు చేసి వినియోగదారులకు అమ్ముతున్నారని సమాచారం రాగా దాడి చేసి ఎస్సై ఆంజనేయులు, సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు సీఐ సంపత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దుకాణంపై సోదాలు చేసి 50 గ్రాముల ఆల్ఫోజూరం, 100 గ్రాముల గుర్తు తెలియని రసాయనాలుదొరకగా వాటిని స్వాధీనం చేసుకుని ఆ కల్లు డిపోను నడిపిస్తున్న మెట్టు సిద్దాగౌడ్, మెట్టు నారాగౌడ్, కాసాలా బాబాగౌడ్, మెట్టు రాజాగౌడ్, వీరికి ఆల్ఫోజూరంను సరఫరా చేస్తున్నటువంటి ముష్యం వెంకటరమణగౌడ్‌లపై కేసు నమోదు చేసి, 5గురిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

రాజంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామశివారులో గురువారం పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్‌చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. అరెస్ట్‌చేసిన వారి వద్ద నుంచి డబ్బులు, మొబైల్ ఫోన్ లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాళేశ్వరం దేవస్థానం వరకు బస్సు ఏర్పాటు

కామారెడ్డిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శైవ క్షేత్రాలకు టీజీఎస్ఆర్టీసీ కామారెడ్డి నుంచి ప్రతీ ఆదివారం కాళేశ్వరం దేవస్థానం వరకు ఎక్స్‌ప్రెస్ బస్సు సౌకర్యం కలదని డిపో మేనేజర్ ఇందిర తెలిపారు. కాళేశ్వరం దారిలోని వేములవాడ, కరీంనగర్, మంథని మీదుగా ఉదయం 7 గంటలకు కామారెడ్డి బస్టాండ్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.30 వరకు చేరునని తిరిగి సాయంత్రం 4 గంటలకు బయలుదేరునని తెలిపారు. పెద్దలకు రూ.320, పిల్లలకు రూ.160 ధర ఉందని తెలిపారు.

దుర్కిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నసురుల్లాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ ఏఎంసీ చైర్మన్‌గా దుర్కి గ్రామానికి చెందిన దుర్గం శ్యామలను నియమించినందుకు గాను గురువారం దుర్కి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలను చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గం శ్యామలను ఏఎంసీ చైర్మన్‌గా నియమించి నందుకు గాను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి దుర్కి గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా సహకార వారోత్సవాలు ప్రారంభం



లింగంపేటలో జెండా ఎగురవేస్తున్న సొసైటీ చైర్మన్



తిప్పాపూర్‌లో సహకార వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

లింగంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. మండల కేంద్రంలో సహకార సంఘం చైర్మన్ దేవెందర్‌రెడ్డి జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు రైతులకు అన్నివిధాలా సహకారాలను అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాకం రాములు, సీఈవో పెంటయ్య, డైరెక్టర్లు సాయిలు, సాయాగౌడ్, రైతులు ఉన్నారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా జంగంపల్లి, బస్వాపూర్, రామేశ్వర్‌పల్లి, అంతంపల్లి, పెద్దమల్లారెడ్డి, కాచాపూర్ విండోల్లో గురువారం 71వ సహకార వారోత్సవాలను ఆయా విండోల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయా విండోల ఆవరణలో సప్తవర్ణ పతకాన్ని ఎగురవేశారు. అనంతరం విండో చైర్మన్లు, సీఈవోలు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం 14 నుంచి 20 వరకు సహకార వారోత్సవాలను నిర్వహించి 7 రోజుల పాటు ఏడు అంశాలపై సభ్యులకు, ఖాతాదారులతో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విండోల పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలో సహకార సంఘం ఆవరణలో సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి, 71వ సహకార వారోత్సవాలను పురస్కరించుకుని అధ్యక్షులు హన్మంత్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఈవో సందీప్ మాట్లాడుతూ సహకార వారోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు.

27న కాలభైరవ క్షేత్ర ఆర్యవైశ్య సేవా సంఘం ఎన్నికలు

రామారెడ్డి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాలభైరవ స్వామి ఆలయం ఆవరణలో కాలభైరవ క్షేత్ర ఆర్యవైశ్య సేవా సంఘం ఎన్నికలు ఈ నెల 27వ తేదీన జరగనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్యవైశ్య సేవ సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. ఎన్నికల కోసం నామినేషన్లు ఈ నెల 20వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

సదాశివనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు చేప విత్తనాలను జాగ్రత్తగా పెంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మండల అభివృద్ధి అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువులో ఎంపీడీవో అనుమతితో సీనియర్ అసిస్టెంట్ రషీద్ మత్స్యకారులతో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 156 హెక్టార్ల నీటి విస్తీర్ణం కలిగిన పెద్దచెరువులో 1.56లక్ష చేపపిల్లలను వేయడం జరిగిందన్నారు. అందులో 62,442 కట్ల, 780440 రోహు రకాలను వేయడం జరిగిందని తెలిపారు. మత్స్యకారులు మంచి ఆహారం చేప పిల్లలకు వేస్తూ పెంచి పోషించుకుని ఆర్థిక అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ చారి పాల్గొన్నారు.

వ్యవసాయంలో కొత్త విధానాలను ఆవిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ సదాశివరెడ్డి

సదాశివనగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు కొత్త విదానాలను ఆవిష్కరించాలని సింగిల్‌విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి అన్నారు. గురువారం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతు సదస్సు, ఆధునిక వ్యవసాయ పద్దతులు, సరికొత్త ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్, డీఏ,ఏవో ప్రజాపతి, ఇర్షాదుద్దిన్, కిసాన్ సంఘ్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆకుల సిద్దిరాములు పాల్గొన్నారు.

దుకాణదారులకు నోటీసు అందజేత

బాన్సువాడటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని తాడ్కోల్ రోడ్డు దుకాణాల ముందు డ్రైనేజీపై గల నిర్మాణాలను తొలగించాలని గురువారం మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేశారు. డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికతీత తొలగించేందుకు అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులు దుకాణదారులకు సూచించారు.

కలెక్టర్, అధికారులపై దాడి అమానుషం



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

కామారెడ్డిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులపై రైతుల పేరుతో జరిగిన దాడి అమానుషమని టీజీఈజేఏసీ ఉద్యోగులు అన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జిలతో నిరసన తెలపడంతో పాటు అదనపు కలెక్టర్‌లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులపై ముందస్తు పథకం ప్రకారమే దాడి చేశారని రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడంగా పరిగణిస్తున్నామని తెలిపారు. దోషులను వెంటనే శిక్షించాలని, దోషుల వెనుక ఉన్న వారిని కూడా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, టీజీవో జిల్లా కార్యదర్శి సాయిరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోవర్ధన్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం, జిల్లా దివ్యాంగుల సమైక్య ప్రతినిధి శ్రీశైలం, వీఆర్ఏల అసోసియేషన్ ప్రతినిధి చిరంజీవి పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ క్రీడలకు గర్గుల్ విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 68వ జాతీయ స్థాయి అండర్ 17 బాలికల హాకీ క్రీడలకు జడ్పీహెచ్ఎస్ గర్గుల్ విద్యార్థులు ప్రవళిక, భవానిలు ఎంపికయ్యారని పీడీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23 నుంచి 27 వరకు హర్యానా రాష్ట్రంలోని రోహతక్‌లో జరిగే హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ..

గాంధారి: తెలంగాణ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి 68 వ పోటీలో నిర్వహించే అండర్ 14 వాలీబాల్ పోటీలకు పేట్ సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు అర్జున్, బుక్యాఅర్జున్, మధుప్రియ, దీపికలు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్ఎం కుమారస్వామి తెలిపారు.

రాజంపేట: మండలంలోని తలమడ్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన శ్రీకృతి ఎస్‌జీఎఫ్ అండర్ 14 రాష్ట్రస్థాయి వాలిబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి తెలిపారు.

కథల పోటీల్లో గిద్ద విద్యార్థినికి ప్రథమ బహుమతి

రామారెడ్డి: హైదరాబాద్ సాహిత్య అకాడమీలో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా తెలుగు సాహిత్య అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి కథల పోటీల్లో ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రథమ బహుమతి స్వీకరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గీతికకు ప్రథమ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే



దుర్కిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మద్నూర్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వే ఉమ్మడి మద్నూర్ మండలంలో కొనసాగుతుంది. ఉమ్మడి మద్నూర్ మండలంలో 130 మంది సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే కొనసాగిస్తున్నారు. ప్రజల నుంచి పలు సందేహాలు వ్యక్తమవుతున్నప్పటికీ అధికారులు వారి సందేహాలను నివృత్తి చేస్తూ సర్వే కొనసాగిస్తున్నారు. ప్రజల అవసరాలను తీర్చడానికి చేస్తున్న కుటుంబ సర్వేపై పలువురు సందేహాలను వ్యక్త పరుస్తున్నట్లు సర్వే అధికారుల ద్వారా తెలుస్తోంది. కుల గణన కోసమే ఈ సర్వే చేపడితే కులం మతం ఏమిటనే వాటిని తెలుసుకోకుండా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయాలకు సంబంధించిన 76 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని ఎందుకు రూపొందించి సమాచారం తీసుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. ఆస్తుల వివరాలను ఇవ్వడానికి ప్రజలు అనుమానాలు సందేహాలు వ్యక్తపరుస్తున్నారు.

నసురుల్లాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

పెద్దకొడప్‌గల్: జుక్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో సిబ్బంది వివరాలు సక్రమంగా నమోదు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని గుండూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వే నిర్వహించే సమయంలో సిబ్బంది వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. సర్వే నిర్వహించే సమయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగనాథ్, ఎన్యూమరేటర్ పుష్పలత, భారతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన ఇంటింటా జరుగుతున్న సర్వే తీరును గురువారం రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లకు కుటుంబ వివరాలు సక్రమంగా అందించి సహకరించాలని కోరారు.

భిక్కనూరులో బీడీ కార్మికుల భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు,నాయకులు

భిక్కనూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో బీడీ కార్మికులు, బీఎల్‌టీయూ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు మాట్లాడుతూ బీడీ కార్మికులకు 2014 కటాఫ్ తేదీని తొలగించి ఎలాంటి షరతులు లేకుండా రూ.4 016 జీవన భృతిని అందించాలని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ నేటికి అమలు చేయలేదని, గతనెల రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. స్థానిక ఎన్నికలలో బీడీ కార్మికులందరూ తగిన బుద్దిచెప్పాలని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగారపు ఎల్లయ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆంజనేయులు, అనసూయ, లింగం, వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తరుగు దోపిడీ..

(5వ పేజీ తరువాయి)

జిల్లాలోని పలు మిల్లుల్లో తరుగు పేరిట ఇష్టారాజ్యంగా ధాన్యం కోత విధిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో ధాన్యం తీసుకుంటే చర్యలు తీసుకుంటామని పదేపదే హెచ్చరికలు చేస్తున్నా చాలా మంది మిల్లర్లు మాత్రం అనేక కొర్రీలు పెట్టి ధాన్యం దండుకుంటున్నారు. తాళ్లు, తేమ ఉన్నాయంటూ బరువు రావడం లేదంటూ సవాలక్ష కారణాలు చూపిస్తూ మిల్లర్లు 4 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. క్వింటాల్‌కు 5 కిలోల మేర తరుగు తీస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నసురుల్లాబాద్ మండల ఏవోగా భవాని



నసురుల్లాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలానికి నూతన వ్యవసాయ అధికారిణిగా భవాని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలున్న ఎల్లప్పుడు అందుబాటులో ఉండి పరిష్కరిస్తానన్నారు. వ్యవసాయ పరంగా రైతులు తమకు ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొ న్నారు. నూతన మండల వ్యవసాయ అధికారిణిగా మండలానికి విచ్చేసిన భవానికి ఏఈవోలు స్వాగతం పలికారు. ఆమె వెంట ఏఈవోలు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



దుర్కిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఏవో భవాని

నసురుల్లాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామంలో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మండల వ్యవసాయ అధికారిణి భవాని పరిశీలించారు. ఆమె వెంట ఏఈవో సాయి, సుమన్, రైతులు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలో సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మండల తహసీల్దార్ దశరథ్ సహకార సిబ్బందికి సూచించారు. మండలంలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండ ధాన్యం సేకరణ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రైతులు శ్రమించి పండిస్తున్న వరి పంటను వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రామారెడ్డి మండల వ్యవసాయ అధికారిణి భానుశ్రీ పేర్కొన్నారు. రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఎల్లారెడ్డి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్య భావ్య రామ మందిరం నిర్మాణం కోసం ప్రాణాలు అర్పించిన కొఠారి బ్రదర్స్ అదే విధంగా ఎందరో ప్రాణాలను బలిదానం ఇచ్చినటువంటి హైందవ సోదరుల జ్ఞాపకార్థంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 50 మందికిపైగా భజరంగ్‌దళ్ కార్యకర్తలు, హిందూ సంఘాల నాయకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్ విశ్వహిందూ పరిషత్ సభ్యులు తులసిదాస్, వినోద్ కుమార్, భరత్, రాహుల్, హరిబాబు, ఠాకూర్ రాజు, అజయ్, రాజు, బాలరాజు, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఒత్తిడిని తగ్గించాలి

కామారెడ్డిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వేలో ఉపాధ్యాయులకు ఒత్తిడిని తగ్గించాలని ప్రైమరి స్కూల్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి రాజేష్ అన్నారు. సమయం తక్కువ ఉండడం సమాచార సేకరణ ఎక్కువ ఉండడంతో మానసిక సంఘర్షణకు ఉపాధ్యాయులు గురవుతున్నారు. ఉదయం పూట పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఒకటి నుంచి ఐదు గంటల వరకు చేస్తే దాఆదపు పది ఇళ్ల కంటే ఎక్కువ తిరిగే పరిస్థితి లేదన్నారు. ఎన్యూమరేటర్లలో వయస్సులో పెద్ద వారు, మహిళలు ఉన్నారని వీరికి చాలా ఇబ్బంది అవుతుందని తెలిపారు. అధికారులు దృష్టిసారించి సమయాన్ని పొడిగించాలని లేదంటే సిబ్బందిని పెంచాలని కోరుతున్నామన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



భగవాన్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ శివారులోని ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న రసాయనశాస్త్ర అధ్యాపకుడు భగవాన్‌రెడ్డికి ఎస్‌జేజేటీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. స్టడీ ఆన్ కెమికల్ అనాలసిస్ ఆన్ మూసి రివర్ అండ్ ఇట్ ఇంపాక్ట్ అనే అంశంపై డాక్టర్ తుమాటి శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో పరిశోధనా పత్రాన్ని సమర్పించినందుకు డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్లు వారు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

బాన్సువాడటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ డిపోలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణీకులు తమతమ సమస్యలను నేరుగా ఫోన్ ద్వారా తెలపవచ్చన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	కంగువా
దర్శన్	మట్కా
ప్రియా 35	అమరన్
ప్రియా 70	లక్కీ భాస్కర్

బాన్సువాడ

మహేశ్వరి	కా
వెంకటేశ్వర	అమరన్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

